ప్రజాశక్తి
శనివారం 05 నవంబర్ 2022





విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

జగనన్న గోరుముద్ద నాణ్యతగా ఉండాలి

- కలెక్టర్ కోటేశ్వరరావు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద నాణ్యంగా ఉండాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం కర్నూలు రూరల్ మండలంలో మిలిటరీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ సైన్స్ ల్యాబ్‌ను , డిజిటల్ లైబ్రరీని పరిశీలించారు. ఆ తరువాత క్లాసు రూములు పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. సుమతీ శతకంలోని వినదగు నెవ్వరు చెప్పిన అనే పద్యాన్ని విద్యార్థులతో కలెక్టర్ పలికించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నంభోజనం చేశారు. కలెక్టర్ వెంట డిఇఒ రంగారెడ్డి, సర్వ శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వేణు గోపాల్, కర్నూలు రూరల్ తహసిల్దార్ రమేష్ బాబు, హెచ్ఎం. విజయమ్మ పాల్గొన్నారు.

8లోపు జాబితాను ప్రదర్శించాలి

గ్రామ సభల్లో ఇకెవైసి రైతులు లేవనెత్తిన అభ్యంతరాలను సవరించి ఈ నెల 8వ తేదీన జాబితాను ప్రదర్శించాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హార్టికల్చర్‌కు సంబంధించి భూమి సాగుకు పనికి రాకపోతే ఇతర అవసరాల కోసం ఏమైనా ఉపయోగం ఉంటుందా లేదా అని చూడాలన్నారు. అవసరమైతే అక్కడ వెదురును పెంచడం వల్ల పంట మార్పిడి చేయడంతో పాటు ఉపాధి పొందడంతో పాటు, నీటి సాంద్రత పెరిగి వర్షాలు కురవడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. పంటలకు ఎక్కువ శాతం రసాయనాలు ఉపయోగించకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానమంత్రి మత్యసంపద యోజన కింద చేపల వినియోగం పెంచాలని ఆదేశించారు. ఆదోని పరిసర ప్రాంతాల్లో వందల ఎకరాలలో ఆక్వాకల్చర్ తుంగభద్ర నది నీటిని వినియోగించి చేపల పెంపకం చేయడం జరుగుతుంది అని తెలిపారు. జెడి అగ్రికల్చర్, ఎపిఎంఐపి పిడి ,జెడి ఫిషరీస్ , ఏడి హార్టికల్చర్, ఏడి మార్కెటింగ్ తదితరులు పాల్గొన్నారు.

నిలువ నీడ కరువు

- భద్రత లేని నీలిషికారుల జీవితాలు - మరుగుదొడ్లు లేవు
-వర్షం వస్తే ఇళ్లలోకి నీరు - ఉన్నతాధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బంగారుపేటలో ఎక్కువ శాతం నీలిషికారులు అనే అత్యంత పేదలు నివాసం ఉంటారు. వారి ప్రధాన వృత్తి ఒకప్పుడు సారా తయారు చేసి అమ్ముకం. కర్నూలు నగరంలో కెసి కెనాల్ వెంట ఇళ్ల నిర్మాణం చేసుకొని నివాసం ఉండేవారు. కెసి కెనాల్ వెంట సారా భట్టీలు పెట్టి సారా తయారు చేస్తున్నారని ఎక్సైజ్ శాఖ వారు అనేక సార్లు దాడులు నిర్వహించారు. అవగాహనలు కల్పించే ప్రయత్నం చేశారు. కాని ప్రత్యామ్నాయ ఉపాధి చూపడంలో పాలకులు విఫలమయ్యారు. వారిలో మార్పు కల్పించలేకపోయారు. వారికి ఇళ్లు నిర్మించుకునే స్థోమత లేక కెసికెనాల్ వెంట నిర్మించుకున్న అరకొర సౌకర్యాలతో ఉన్న ఇళ్లను నగరపాలక సంస్థ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో కెసి.కెనాల్ వెంట రోడ్డు వేయాలనే నెపంతో బుల్డోజర్లతో కూల్చివేశారు. మొదటిసారి 42 గృహాలను కూల్చి వేశారు. ఆ సందర్భంగా తాము ఎక్కడ ఉండాలని ప్రశ్నించగా 202 మందికి తడకనపల్లె వద్ద ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చారు. అక్కడ సరైన ఇళ్లు నిర్మించి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వలన అక్కడికి వెళ్లడానికి సుముఖత చూపలేదు. రెండోసారి సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో 102 ఇళ్లను కూల్చి వేశారు. ఈ సందర్భంగా ఒక మహిళ ఆశ్రమం లేక రాత్రంతా వర్షంలో తడిసి చనిపోయింది. అదే సమయంలో 44 మందికి తడకనపల్లి వద్ద ఇంటి స్థలాలకు పట్టాలు ఇచ్చారు. మరో 44 మందికి టిట్కో గహాలను కూడా కేటాయించారు. రుద్రవరం పరిధిలో మరో 10 మందికి ఇంటి స్థలాలను కేటాయించారు. దరఖాస్తు చేసిన వాళ్లందరికీ వారి అవసరాలను గుర్తించి అర్హులందరికీ ఇళ్ల స్థలాలను కేటాయించారు. సరైన వసతులు కల్పిస్తేనే ఎవరైనా నగరానికి దూరంగా వెళ్లడానికి సిద్ధపడుతారు. కాని ప్రభుత్వం ఆ పని చేయకుండా ఇళ్లతోపాటు నగరపాలక సంస్థ లక్షలాది నిధులు కేటాయించి స్త్రీపురుషులకు వేర్వేరుగా నిర్మించిన సామూహిక మరుగుదొడ్లను కూడా కూల్చివేశారు. ఆ మరుగుదొడ్లు కూల్చివేయడంతో పేదలైన వారికి మరుగుదొడ్ల లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రజలసొమ్ముతో లక్షల రూపాల జీతాలు తీసుకునే ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులకు పేదల కష్టాలు మాత్రం అర్థం కావు. మానవత్వ లేని పాలకులు నిరాశ్రయులను చేసిన నీలిసికారులకు ఇప్పటికైనా కనీస వసతులు కల్పించి సరైన నివాసం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



బంగారు పేట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న నాయకులు (ఫైల్)

లెట్రిన్లు లేవు

- కైరున్‌బీ, విఠల్ నగర్



రోడ్డు విస్తరణలో భాగంగా ఫిషరీస్ కాంపౌండ్ ఆనుకొని నిర్మించిన సామూహిక మరుగుదొడ్లు కూల్చివేశారు. బహిర్ భూమికి వెళ్లడానికి మరుగుదొడ్లు లేవు. బంగారు పేటకు చెందిన మగవారులెట్రిన్ల వద్ద వచ్చి తాగడం, ఆడటం చేస్తుంటారు. దీనితో నిత్యం కొట్లాటలు జరుగుతుంటాయి. లెట్రిన్లు కట్టుకోవడానికి ఆర్థిక సహాయం చేయాలి.

వర్షం వస్తే ఇళ్లలోకి నీరు చేరుతోంది

- భవానిజి, బంగారు పేట



బంగారుపేటలో రోడ్డు విస్తరణలో భాగంగా అక్రమ కట్టడాలను టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. అందులో మా ఇల్లు పోయాయి. కొద్దిపాటి స్థలంలో కాపురం చేస్తున్నాం. అయితే రక్షణ గోడ కట్టకపోవడంతో వర్షపు నీరంతా ఇళ్లలో చేరుతుంది. ఇండ్లలోకి నీరు చేరకుండా రక్షణ గోడ నిర్మించాలి. నాటి నుండి నేటి వరకు విద్యుత్ తీగలు కూడా కర్రల సాయంతో పెట్టుకున్నాం. విద్యుత్ అధికారులు కూడా స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను ఎత్తులో ఉండేటట్లు చూడాలి. కనీస వసతులైన మరుగుదొడ్లు, విద్యుత్ తీగలు సరి చేయటం లాంటివి ఏర్పాటు చేసి ఆదుకోవాలి.

బాడుగ ఇంట్లో ఉంటున్న

- పద్మమ్మ, బంగారుపేట



బంగారుపేటలో ఇండ్లు కూల్చేసిన సందర్భంలో గూడు లేని పక్షులయ్యాం. అయితే మాకు ఇంటి స్థలానికి పట్టాలు ఇచ్చారు. ఇల్లు కట్టుకునే స్తోమత లేదు. బాడుగ ఇంట్లో ఉంటున్నాం. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఇల్లు కట్టి ఇవ్వాలి.

బాధ్యతగా పని చేయండి

- పెండింగ్ కేసులు తగ్గించండి
- డీఎస్పీలు దృష్టి సారించాలి
- నేర సమీక్షలో ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

బాధ్యతగా పని చేసి ఈ నెల 12న జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేయాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సూచించారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో జిల్లాలోని డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలతో ఎస్పీ నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు అధికారులతో మాట్లాడారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని సబ్ డివిజన్‌లోని పెండింగ్ కేసులపై సమీక్షించారు. పెండింగ్ కేసులపై డీఎస్పీ స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు తగ్గించే విధంగా అందరూ కృషి చేయాలని తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసిన పోలీసు అధికారులను అభినందించారు. జిల్లాలోని ఇతర సమస్యాత్మక పట్టణాలు, గ్రామాల్లో ప్రజల భద్రత కోసం మరిన్ని సిసి కెమెరాలు ఏర్పాటు చేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు 50 శాతం తగ్గాయని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా డ్రమ్ములతో మలుపులు ఉండే విధంగా జిగ్ జాగ్ రేడియంతో బారీ కేడ్స్ ఏర్పాటు చేయించాలని తెలిపారు. లాంగ్ పెండింగ్ కేసులు, యుఐ కేసులు, ఐపిసి కేసులు, ఎక్సైజ్ కేసులు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయో పోలీసు స్టేషన్ల వారీగా పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని కేసులు ఛార్జీషీట్లు వేశారు, ఎన్ని కేసులు ఫైలింగ్ చేశారనే విషయాలను ఆరా తీశారు. కోర్టుల నుంచి సిసి నెంబర్లు త్వరగా తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసుల గురించి పూర్తిగా ఆరా తీసి సంవత్సరం ముగింపులోపు పెండింగ్ కేసులు బాగా తగ్గించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఈ-చలానాలను రీకవరీ చేయాలన్నారు. లాంగ్ పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో దర్యాప్తులు, త్వరగా విచారణలు పూర్తి చేయాలని తెలిపారు. నవంబర్ 12న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో రాజీ అయ్యే కేసులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ డి.ప్రసాద్, లీగల్ అడ్వయిజర్ మల్లికార్జున రావు, డీఎస్పీలు యుగంధర్ బాబు, వినోద్ కుమార్, శ్రీనివాసులు, కెవి.మహేష్, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

పత్తికొండ ఆర్‌డిఒకు న్యాయం చేయండి

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ ఆర్‌డిఒకే ప్రభుత్వం న్యాయం చేయకపోతే దళితులైన మాకేం న్యాయం చేస్తారని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్ బాబు అన్నారు. శుక్రవారం పత్తికొండ ఐసిడిఎస్ ప్రాంగణంలో కెవిపిఎస్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తికొండ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేసి ఏడు నెలలు కావస్తున్నా ఆర్‌డిఒగా బాధ్యతలు స్వీకరించిన మోహన్‌దాస్‌కు జీతభత్యాలు ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగికి జీతభత్యాలు ఇవ్వలేని ప్రభుత్వాలు దళితుల కుటుంబాలను ఎలా ఆదుకుంటాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జీతభత్యాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ఈనెల 28, 29 తేదీలలో కెవిపిఎస్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్‌బాబు కోరారు పత్తికొండ ఐసిడిఎస్ ప్రాజెక్టు ప్రాంగణంలో కెవిపిఎస్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా సురేంద్ర, కార్యదర్శి గిత్తరి రమేష్ , ఆంధ్రప్రదేశ్ చర్మకార వృత్తి సంఘాన్ని కూడా ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా కొట్టాల రంగన్న, కార్యదర్శి కోలంట్ల నాగరాజు ను ఎన్నుకున్నారు. ఈనెల 28,29 తేదీల్లో కెవిపిఎస్ రాష్ట్ర మహాసభలను నాయకులు, కార్యకర్తలు దళితులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆనంద్‌బాబు, నాయకులు



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నాగేష్

బస్తిపాడులో డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం బస్తీపాడు గ్రామంలో గ్రామ కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షతన డివైఎఫ్ఐ 42వ ఆవిర్భావ దినోత్సవ సభ శుక్రవారం నిర్వహించారు. మండల కార్యదర్శి వెంకటేష్ జెండావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ మాట్లాడుతూ స్వాతంత్ర ఫలాలను అందరికీ సమానంగా అందించాలనే ఉద్దేశంతో 1980లో పంజాబ్ రాష్ట్రంలోని లూధియానా నగరంలో నవంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు అన్ని రాష్ట్రాల ప్రజాతంత్ర సంఘాలను కలిపి అందరికీ విద్య ఉపాధి కావాలంటూ కులమత ప్రాంతలింగ వివక్షతలకు వ్యతిరేకంగా యువతి యువకుల మధ్య ఐక్యతను, దేశభక్తి భావాలను పెంపొందించడానికి డివైఎఫ్ఐ సంఘాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. అప్పటినుంచి ఇప్పటివరకు మా దేహం ముక్కలైన ఈ దేశాన్ని ముక్కలు కానివ్వమంటూ పోరాడుతున్న సంఘం డివైఎఫ్ఐ అని తెలిపారు. ఈ దేశంలో అవినీతి అంతం డివైఎఫ్ఐ పంతం అనే నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమించామని తెలిపారు. ప్రస్తుతం భారతదేశంలో ఎన్నడూ లేనంత నిరుద్యోగం, డ్రగ్ మాఫియా పెరిగిపోవడం వల్ల డ్రగ్స్ అంతం నిరుద్యోగమంతం డివైఎఫ్ఐ పంతం అనే నినాదంతో పనిచేస్తున్నామని తెలిపారు. నేడు భారతదేశంలో అతిపెద్ద యువజన సంఘంగా డివైఎఫ్ఐ ఉందని తెలిపారు. రామకృష్ణ, హరికృష్ణ, మనోహర్, అయ్యన్న, రంగస్వామి, సాయి, మైబు, ఇస్మాయిల్, డివైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కోడుమూరు

విజిలెన్సు అవగాహనా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం కోడుమూరు పట్టణంలో గల సాయిరాం డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు విజిలెన్సు ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో "అభివృద్ధి చెందుతున్న దేశం కోసం అవినీతి రహిత భారతం" అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే కోడుమూరు పట్టణంలో సాయిరాం డిగ్రీ కాలేజీ నుండి కోట్ల జంక్షన్ మీదుగా బస్టాండు వరకు "అవినీతిరహిత భారతం - సాదిద్దాం మనమందరం" బ్యానర్‌తో ప్రదర్శన చేశారు. డిఎస్‌పి సుధాకర్‌రెడ్డి, సిఐ కేశవరెడ్డి, ఎజి సిద్దయ్య, ఎస్ఐ హనుమంతయ్య, కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



ముమ్మరంగా సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి-తుగ్గలి: మండలం పరిధి లోని వివిధ గ్రామాలలో శుక్రవారం సామాంజిక తనఖీ బృందం రైతులు పొలాల్లో నాటిన చెట్లను సామజిక తనఖీ డిఆర్‌పి పరిలించారు. గత రెండేళ్లకు సంబందించిన పనులు అన్ని గ్రామాలల్లో ముమ్మరంగా పరసిలిస్తున్నారు. ప్రతి గ్రామంలో కూలీలు చేసిన పనులు, వితంతు, వృధ్యాప్య, వికలాంగుల పింఛన్లు సక్రమంగా అందుతున్నాయా లేదానని వారు గ్రామాల్లో విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పిలు, టిఎ, ఎఫ్ఎ, సీనియర్ మేటీలు పాల్గొన్నారు.



పొలాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

'టిఎంఆర్ 99' వరల్డ్ షాపు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు క్రైం: తక్కువధరతో సామాన్యులకు అందరికీ అందుబాటులో ఉండేలా నాణ్యమైన వస్తువులను అందించే కేరాఫ్ అడ్రస్ గా టిఎంఆర్ 99 నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం కర్నూలు ఆనంద్ థియేటర్ పక్కన ఉన్న యుకాన్ లెజెండ్ షాపింగ్ కాంప్లెక్స్ లో నూతనంగా ఏర్పాటు చేసిన టిఎంఆర్ 99 వరల్డ్ షాపును మాజీ ఎమ్మెల్యే ఎస్వి.మోహన్‌రెడ్డి, విజయ మనోహరి దంపతులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ... నగరంలో గృహోపకరణాల వ్యాపారంలో ఈ సంస్థ ఉత్తమ సేవలను అందిస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. తక్కువ ధరతో ఉత్తమ వస్తువులను అందిస్తూ ఆదరణ పొందుతోందన్నారు. మరింత అభివృద్ధి చెందాలని అకాంక్షించారు. ప్రొప్రైటర్లు చల్లా రవికుమార్, తబిత మాట్లాడుతూ... తమ షాపును ప్రజలు ఇప్పటికే ఉత్తమంగా ఆదరించారని, ఆనతికాలంలోనే మరో షాపును ప్రజల దగ్గరికి చేర్చేందుకు ఆవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు అదరించాలని కోరారు.



టిఎంఆర్ 99 వరల్డ్ షాపింగ్ షాపును ప్రరంభిస్తున్న ఎస్‌వి మోహన్‌రెడ్డి దంపతులు



వ్యవసాయాధికారిని, రైతులను సన్మానిస్తున్న టిటిడి అధికారులు

రైతులకు టిటిడి సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి)తో పాటు రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలకు లడ్డూ ప్రసాదం తయారీ కోసం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు సరఫరా చేసే రైతులను ఎంపిక చేసి శుక్రవారం తిరుమలలోని శ్వేతభవన్‌లో ప్రకృతి వ్యవసాయ రైతులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. లడ్డూ తయారీకి ఇప్పటికే ప్రకతి వ్యవసాయ పద్ధతిలో పండించి టిటిడికి సరఫరా చేసిన శనగ రైతులకు, ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి చంద్రశేఖర్‌కు సన్మానించారు. రైతుసాధికార సంస్థ టిటిడితో పాటు 11 ఆలయాలకు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు సరఫరా చేయనుంది. కనీస మద్దతు ధర కంటే 10 శాతం అదనంగా ప్రీమియం ధర దక్కేలా ఏర్పాట్లు చేస్తున్నారని వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. గత సంవత్సరం మన కర్నూలు జిల్లా నుండి ప్రకృతి వ్యవసాయం ద్వారా 823 మంది రైతులతో 1515 ఎకరాల్లో సాగుచేసి పండించిన 7515 క్వింటాళ్ల శనగలను ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా టిటిడి దేవస్థానానికి ఇచ్చిన శనగలకు మద్దతు ధర 10 శాతం అధికంగా చెల్లించారన్నారు. ఈ సంవత్సరం కూడా ప్రకతి వ్యవసాయం ద్వారా పండించిన శనగలు, వడ్లు, కందులను ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఇఒ ధర్మారెడ్డి, మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ చిరంజీవి చౌదరి, మార్క్ ఫెడ్ ఎండి ప్రద్యుమ్న, రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, సిఇఒ బి రామారావు పాల్గొన్నారు.

బంకుల అక్రమ ఏర్పాటును అడ్డుకున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి-సి బెళగల్ : సి.బెళగల్‌లోని హైస్కూల్ ఆవరణం ముందు ప్రధాన రహదారికి ఆనుకోని అక్రమణ దారులు, మరి కొందరు పేదలే బంకులు ఏర్పాట్లు చేసుకోవడాన్ని ఎంపిడిఒ అడ్డుకున్నారు. ఈ ప్రహరీ నాలుగు వందల మీటర్ల పొడవు ఉంటుంది. ఇదే హైస్కూల్ లో 800 మంది విద్య నభ్యసి స్తున్నారు. అందులో బంకులు ఏర్పాట్లు చేస్తే ఇక్కడికి వచ్చే బాలికలపై ఆకా తాయిల ప్రభావం పడుతుందని గతంలో అధికారులు హెచ్చరించారు. అయినా అధికారుల కళ్ళు గప్పి నాయకుల, దౌర్జన్యకారుల అండదండలతో రెండు మూడు రోజులుగా బంకులు ఏర్పాట్లకు కుస్తీ పడుతున్నారు. ఈ బంకులు బతకడానికయితే సరి..ఇక్కడ అలా కాకుండా బంకులనుంచి నెల నెలా అద్దె వేలల్లో దండు కొంటున్నారు. పంచాయతీ ఆదాయం మాత్రం పట్టడం లేదు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని ఎంపిడిఒ రాముడు, ఇఒఆర్‌డి సందీప్‌లు అడ్డుకొని హెచ్చరికలు జారీ చేశారు.

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్


కర్నూలు నగరంలోని వెంకటరమణ కాలనీలో పంపుహౌస్ దగ్గర ఉన్న మునిసిపల్ స్థలంలో రూ.8కోట్ల అంచనాతో నిర్మించనున్న షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం భూమి పూజ కార్యక్రమానికి కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సంజీవ్ కుమార్, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హఫీజ్ ఖాన్, సుధాకర్, నగర మేయర్ బి వై రామయ్య, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ్, నాయకులు తెర్నేకల్ సురేందర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రేణుక రెడ్డి, స్థానిక కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావుతో కలసి మంగళవారం భూమి పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కర్నూలు నగరం అన్ని రంగాల్లో సుందరంగా తయారవుతుందని ఆ దిశగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేస్తున్నారని అన్నారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ ఓపెన్ టెండర్ లోనే వేలం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, అధికారులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



షాపింకుకాప్లెక్సుకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్

మహా పాదయాత్రకు టిజి భరత్ రూ. 1 లక్ష విరాళం

కర్నూలు హాస్పిటల్: శ్రీ 1008 శ్రీశైల జగద్గురు చెన్న సిద్దరామ పండితారాధ్య శివాచార్య మహా స్వాముల మహాపాదయాత్రకు టిజివి సంస్థల ఛైర్మన్ టిజి భరత్ రూ. ఒక లక్ష విరాళం ఇచ్చారు. పాదయాత్ర ఈ నెల 24 వ తేదీన కర్నూలుకు చేరుకుంటున్న సందర్భంగా మహా పాదయాత్ర కమిటీ సభ్యులు టిజి భరత్‌ను మౌర్య ఇన్‌లో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా పాదయాత్రకు భరత్ రూ. ఒక లక్ష విరాళం అందించారు. కమిటీ సభ్యులకు చెక్కును అందజేసి పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతున్నట్లు చెప్పారు. రూ. లక్ష విరాళం ఇచ్చిన టిజి భరత్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు



వలసల నివారణకు చర్యలు

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆలూరు



ప్రశంసా పత్రాలు అందజేస్తున్న పీడీ అమర్‌నాథ్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వలసలు నివారించి, ప్రతి కుటుంబానికీ ఉపాధి కల్పిస్తోందని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలూరు సిఎల్‌ఆర్‌సిలో ఉపాధి హామీ చట్టంపై ఆలూరు, పత్తికొండ క్లస్టర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రణాళికబద్ధంగా గ్రామాల్లో ఉపయోగపడే పనులను గుర్తించాలని తెలిపారు. వలసలు వెళ్లకుండా అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించడమే లక్ష్యమని చెప్పారు. ప్రతి ఉపాధి ఉద్యోగి విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించి ప్రోగ్రెస్ తీసుకురావాలని సూచించారు. నవంబర్ 15లోపు గ్రామసభలు నిర్వహించాలన్నారు. ఎన్‌ఎంఎంఎస్ యాప్ ద్వారా మస్టర్ హాజరును అప్‌లోడ్ చేయాలని తెలిపారు. రికార్డులు, మస్టర్లు సక్రమంగా ఉండాలన్నారు. అనంతరం 2021 సంవత్సరంలో ఉత్తమ పనితీరు కనబరచిన ఎపిఒలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అడిషనల్ పీడీ సలీం బాషా, డివిఒ మూర్తి, ఎంఇ భాస్కర్ నాయుడు, ఏపీడీలు సురేష్ బాబు, పద్మావతి, కృష్ణమోహన్, ఎపిఒ హేమ సుందర్, మాధవశంకర్, శ్రీనివాసులు, ఇసి.మారన్న పాల్గొన్నారు.

రైతులకు రాయితీపై భోజనం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతు రాయితీ భోజనాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఇస్కాన్, మార్కెట్ యార్డు భాగస్వామ్యంతో రూ.20లకే రైతులకు భోజనం అందిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు మార్కెట్ యార్డులో రాయితీ భోజనాన్ని అందించడం సంతోషదాయకమన్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్ మహబూబ్ బాషా, వైస్ ఛైర్మన్ కామాక్షి, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ అనిల్ కుమార్, వైసిపి నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, వ్యాపార సంఘం అధ్యక్షులు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

కనులపండువగా ఆరాధన ఉత్సవాలు

- టిడిపి ఇన్‌ఛార్జి కోట్ల సుజాతమ్మ పూజలు

ప్రజాశక్తి - ఆస్పరి



సుజాతమ్మకు స్వాగతం పలుకుతున్న నాయకులు

మండలంలోని అట్టేకల్లు గ్రామంలో శ్రీపరదేశప్ప తాత 12వ ఆరాధనోత్సవాలు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం కనులపండువగా సాగాయి. ముందుగా తాత సమాధికి గంగాభిషేకం, పుష్పాభిషేకం, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి నిర్వహించారు. సాయంత్రం పల్లకి సేవ, నందికోల ఉత్సవం, రాత్రి భజన పోటీలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గ్రామంలో ఎలాంటి అసౌకర్యాలూ కలుగకుండా సర్పంచి లతశ్రీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో వసతులను ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, మంత్రి సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, దేవరగట్టు ఆలయ కమిటీ ఛైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు వేర్వేరుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిలేకల్ సర్పంచి శ్రీనివాసులు, ఎంపిటిసి సుంకులమ్మ, మాజీ ఎంపిటిసి శివకుమార్, వైసిపి మండల కన్వీనర్ పెద్దయ్య, టిడిపి మండల కన్వీనర్ పరమారెడ్డి, నాయకులు రాజశేఖర్, అంజి, శ్రీను, హనుమంతు రెడ్డి, శివమూర్తి, నాగరాజు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- అదుపు తప్పి పాఠశాల బస్సు బోల్తా - భయాందోళనలో చిన్నారులు

ప్రజాశక్తి - చిప్పగిరి

అదుపు తప్పి పాఠశాల బస్సు బోల్తా పడింది. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. రోజూలాగే నగరడోనా, నేమకల్లు, బెల్డోన గ్రామాలకు చెందిన విద్యార్థులు గుంతకల్లుకు చెందిన కెసి.నారాయణ పాఠశాల బస్సులో బయల్దేరారు. ఎక్కిన అరగంటలోపు బెల్డోన సమీపంలోని బావి దగ్గర బస్సు అదుపుతప్పి బోల్తా పడింది. సమాచారం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే వచ్చి చూడగా ఎవరికీ, ఏ ప్రమాదమూ జరగలేదని ఊపిరి పీల్చుకున్నారు. పెను ప్రమాదం తప్పిందని, అనుభవం గల డ్రైవర్లతో, బస్సులో ఎంత ప్రయాణిస్తారో అంతవరకే ఉండేటట్లు చూసుకోవాలని పాఠశాల యాజమాన్యాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

'డ్రాగన్' సాగు.. భలే బాగు...

- దీర్ఘకాలికంగా దిగుబడులు
- ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

ప్రజాశక్తి - ఆస్పరి

డ్రాగన్ ఫ్రూట్స్ సాగు అంటే రూ.లక్షల్లో పెట్టుబడి అవసరం. పంట సాగు చేయాలంటే అన్నదాతకు ఎంతో అవగాహన ఉండాలి. ఈ పంటకు పెట్టుబడి వ్యయం రూ.లక్షల్లో ఉండడంతో డివిజన్ వారీగా కరివేముల, ఆస్పరి గ్రామాల్లో ఇద్దరు రైతులు మాత్రమే సాగు చేశారు. మనిషికి డ్రాగన్ ఫ్రూట్ ఆరోగ్యపరంగా ఎంతో అవసరమని గ్రహించి పంట సాగు చేయాలనే ఆసక్తితో ఆస్పరి గ్రామానికి చెందిన బి.సుధాకర్ రెడ్డి పంట సాగుకు ముందుకొచ్చారు. ఆయన సాగు చేసిన రెండున్నర ఎకరాల డ్రాగన్ ఫ్రూట్ సాగుపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం...

రూ.లక్షల్లో పెట్టుబడి

2.27 ఎకరాల్లో దాదాపు రూ.20 లక్షల పెట్టుబడి పెట్టి పంట సాగు చేశారు. తెలంగాణ రాష్ట్రం సదాశివపేట నుంచి ఒక్కో మొక్క రూ.70 చొప్పున 5 వేల మొక్కలను కొనుగోలు చేశారు. 8×8 సైజులో సిమెంటు దిమ్మెలను ఏర్పాటు చేసి ఒక్కో దిమ్మెకు నాలుగు మొక్కల ప్రకారం నాటారు. పంటకు స్ప్రింకర్లను ఏర్పాటు చేశారు. స్ప్రింకర్లను ఏర్పాటు చేయడం వల్ల నీరు ఆదా అవుతుంది. ఒక్కో దిమ్మెకు రూ.600 చొప్పున 500 దిమ్మెలను పొలంలో ఏర్పాటు చేశారు. పంటకు రక్షణ నిమిత్తం కంచెను ఏర్పాటు చేశారు. రూ.4 లక్షల దాకా పెట్టుబడి పెట్టారు.



డ్రాగన్ ఫ్రూట్ తోట

దీర్ఘకాలికంగా దిగుబడులు

ఈ పంట సాగు చేసినప్పటి నుంచి 25 సంవత్సరాల వరకు దిగుబడులు పొందవచ్చు. ప్రస్తుతం ఆయన పొలంలో 18 నెలల పంట ఉంది. ఇప్పటివరకు 2.27 ఎకరాలకు సంబంధించి మూడు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. పంట ఎదుగుతుండడంతో దిగుబడి పెరిగింది. ప్రస్తుతం పంట కోతకొస్తే ఒకేసారి రెండు క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దీర్ఘకాలికంగా దిగుబడి వచ్చే అవకాశం ఉన్నందున లాభాలు బాగా ఉంటాయనే ఆశతో అన్నదాతలు పంట సాగుపై ఆసక్తి చూపుతారు.

ఆరోగ్యపరంగా ఎంతో మంచిది

డ్రాగన్ ఫ్రూట్ ఆరోగ్యపరంగా ఎంతో మంచిది. బీపీ, షుగర్, కిడ్నీ, జీర్ణశక్తి తదితర ఆహార సంబంధిత వ్యాధులకు డ్రాగన్ ఫ్రూట్ పండు తినాలని వైద్యులు సూచిస్తుంటారు. ఎన్నో ఆరోగ్య సమస్యలతో బాధపడే వారు ఎక్కువగా ఈ పండును కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాపారులు కిలో రూ.300లకు అమ్ముతున్నారు. రైతుల నుంచి రూ.150లోపే కొనుగోలు చేస్తారు.

ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం

ఈ పంట సాగు చేయాలంటే చిన్న, సన్న కారు రైతులకు ఎంతో కష్టంతో కూడుకున్నది. ఒక ఎకరాలో పంట సాగు చేయాలంటే దాదాపు రూ.10 లక్షలు అవసరం అవుతుంది. ఇంత భారీ పెట్టుబడితో సాగు చేసిన పంటకు ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో అవసరం అవుతుంది. పంట సాగుకు అవసరమైన సబ్సిడీతో స్ప్రింక్లర్లు, దిమ్మెలు, పండ్ల మొక్కలు అందిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

వ్యవసాయ రంగంలో కొత్తగా వెళ్లాలని

- బి.సుధాకర్ రెడ్డి, ఆస్పరి



మా ప్రాంతంలో సాగు చేయని కొత్త పంట వేయాలని అన్వేషణలో డ్రాగన్ ఫ్రూట్ సాగుపై ఆసక్తి పెరిగింది. పంట పెట్టుబడి వ్యయం ఎక్కువైనప్పటికీ డ్రాగన్ ఫ్రూట్ పంట ప్రజలకు ఆరోగ్యపరంగా ఎంతో అవసరమని పంట సాగు చేశాను. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి సాగు చేసే పంటకు, రైతుకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం ఎంతో అవసరం ఉంటుంది. సబ్సిడీతో మొక్కలు, దిమ్మెలు, స్ప్రింక్లర్లు అందించాలి.

సమన్వయంతో పని చేయాలి

- సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపిడిఒ

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

సచివాలయ సిబ్బంది ప్రజలకు జవాబుదారీతనంగా ఉండి సంక్షేమ పథకాలు అందే విధంగా సమన్వయంతో కృషి చేయాలని ఎంపిడిఒ గీతావాణి సూచించారు. శుక్రవారం మండలంలోని పెద్దహరివాణం గ్రామం సచివాలయం 1, 2లను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. సమయపాలన పాటించాలన్నారు. వివిధ అంశాల గురించి సచివాలయ అడ్మిన్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో నాడు-నేడు, అంగన్వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకాన్ని పరిశీలించారు. సర్పంచి రాము, ఇన్‌ఛార్జి ఇఒఆర్‌డి నాగరాజు, పంచాయతీ కార్యదర్శులు నాగరాజ్, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ గీతావాణి

కోటకొండలో డెంగీ కేసు నమోదు

దేవనకొండ : మండలంలోని పి.కోటకొండ గ్రామంలో డెంగీ కేసు నమోదు కావడంతో శుక్రవారం మండల ఆరోగ్యశాఖ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ ఉమాదేవి, సర్పంచి తిమ్మక్క మాట్లాడారు. దోమల ద్వారా వ్యాధులు వ్యాపిస్తాయని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అపరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు గ్రామంలో పిచికారి చేయించారు. డెంగీకి గురైన మహిళను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సిబ్బంది తెలిపారు. పంచాయతీ సెక్రటరీ సుంకన్న, వైసిపి నాయకులు లింగన్న పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ తనిఖీలు

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని రంగాపురం, కల్లుకుంట, చిన్నతుంబలంలోని 5 కేంద్రాలను శుక్రవారం సిడిపిఒ నిర్మలదేవి తనిఖీ చేశారు. ఫుడ్ స్టాక్ రిజిస్టర్లు, స్టాఫ్ అటెండెన్స్, ప్రీస్కూల్ అటెండెన్స్‌లను చెక్ చేశారు. అంగన్వాడీ టీచర్లను, ఆయాలను వారి పనితీరును మెరుగుపరుచుకోవాలని హెచ్చరించారు. 2వ కేంద్రానికి ప్రహరీ కావాలని గ్రామస్తులు సిడిపిఒను కోరారు. సూపర్‌వైజర్ శివలింగమ్మ, మహిళా పోలీసు ప్రమీలమ్మ పాల్గొన్నారు.

బాధితులకు బీవీ పరామర్శ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సిపిఐ (ఎంఎల్) నాయకులు జేమ్స్ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలను పరామర్శించారు. పట్టణంలోని 7వ వార్డు టిడిపి అధ్యక్షులు ఎరుకల శ్రీనివాసులు ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్సలు పొంది తిరిగి ఇంటికి చేరుకున్నారు. శుక్రవారం ఆయన శ్రీనివాసులు ఇంటికి వెళ్లి పరామర్శించారు. అలాగే పట్టణానికి చెందిన సిపిఐ (ఎంఎల్) నాయకులు జేమ్స్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. జేమ్స్ స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బీవీ



కుక్కలను ఆటోల్లో ఎక్కిస్తున్న సిబ్బంది

గ్రామం నుంచి కుక్కల తరలింపు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని దౌల్తాపురం గ్రామం నుంచి కుక్కల గుంపును అధికారులు తరలించారు. 'కుక్కలు కరిచి బాలికకు గాయాలు' అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు అధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది కుక్కలకు సంబంధించిన యజమానులకు నోటీసులు ఇచ్చి, వారికి అవగాహన కల్పించారు. అనంతరం కుక్కలను ఆటోల్లో ఎక్కించి దూర ప్రాంతాల్లో విడిచి రమ్మని అధికారులు ఆదేశించారని గ్రామస్తులు తెలిపారు. అధికారులు సమస్యను వెంటనే పరిష్కరించినందుకు గ్రామస్తులు సచివాలయ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సుధీర్, మహిళా పోలీసు గౌరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వందగల్లు విద్యార్థి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

మండలంలోని వందగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని డి.భవాని రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యోగా లింగమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. అక్టోబర్ 16న నంద్యాల జిల్లాలోని గుడ్ షెపర్డ్ పాఠశాలలో జరిగిన కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్టు ఎంపికలో పాల్గొని ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 11 నుంచి 13 వరకు ప్రకాశం జిల్లా చెవూరులో జరిగే ఆంధ్రప్రదేశ్ సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. ఎంఇఒ లక్ష్మీనారాయణ విద్యార్థిని భవానీని అభినందించారు. అక్షరాస్యతలో వెనుకబడిన కోసిగి మండలం నుంచి క్రీడల్లో రాష్ట్రస్థాయికి ఎదగడం అభినందనీయమని తెలిపారు. చదువుతోపాటు క్రీడల్లో కూడా ముందుకు రావాలని, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.



విద్యార్థినితో ఎంఇఒ, హెచ్‌ఎం

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- అఖిలపక్షనాయకులు

ప్రజాశక్తి - ఆదోని

అధిక వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం చెందాయని అఖిలపక్ష నాయకులు మండిపడ్డారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం ఇవ్వాలని అఖిలపక్ష కమిటీ శుక్రవారం ఆదోని రైతు సంఘం అధ్యక్షులు లక్ష్మి రెడ్డి అధ్యక్షతన ఎన్‌జిఒస్ హోమ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. టిడిపి సీనియర్ నాయకులు, ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మాదిరే భాస్కర్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు కురువ దేవేంద్రప్ప, ఎల్‌ఎల్‌సి మాజీ ఛైర్మన్ బసాపురం రామస్వామి, టిడిపి మాజీ ఇన్‌ఛార్జి గుడిసె కృష్ణమ్మ, కాంగ్రెస్ ఆదోని ఇన్‌ఛార్జి నీలకంఠప్ప, ఆర్‌సిసి రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, రైతు కూలీ సంఘం నాయకులు మల్లికార్జున హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు ప్రతేడాది పంటను నష్టపోతూనే ఉన్నారని తెలిపారు. పంటల బీమా కొందరికి ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం పరిపాటిగా మారిందని విమర్శించారు. నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడంలో ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం అయిందనడానికి ఇటీవల రైతులు చేసిన ఆందోళన నిదర్శనమని తెలిపారు. రైతులు విత్తనం నాటుకునే సమయంలో దుకాణాలపై అధికారులు దాడులు నిర్వహించి నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరించాలని కోరారు. రైతుల పక్షపాతి అని ప్రభుత్వం చెప్పుకోవడం కాదని చేతల్లో చూపించాలని హితవు పలికారు. రైతులకు అండగా ఉండి పరిహారం మంజూరయ్యేలా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నాయకులు అజయ్ బాబు, సుజ్ఞానమ్మ, కళావతి, బసాపురం గోపాల్, సుదర్శన్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్ రెడ్డి



శ్మశానంలో పరిశుభ్రత పనులు

ప్రజాశక్తి - హొళగుంద

ఎల్లార్తి గ్రామంలోని శ్మశానంలో శుక్రవారం పరిశుభ్రత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచి కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో యువ నేత ఎస్‌కె.గిరి మాట్లాడారు. శ్మశానంలో ఉన్న ముళ్లకంపను జెసిబితో శుభ్రం చేయించినట్లు తెలిపారు. పాఠశాల ఛైర్మన్ రంగస్వామి, లక్ష్మణ్, రామన్న గౌడ్ పాల్గొన్నారు.

'7లోపు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి'

దేవనకొండ : పట్టభద్రుల ఓటుహక్కును నమోదు చేసుకోవడానికి ఈనెల 7లోపు నమోదు చేసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. శాసన మండలిలో నిరుద్యోగ సమస్యలపై గర్జించే పోతుల నాగరాజును, ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని తెలిపారు. శుక్రవారం దేవనకొండలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆర్‌టిసి బస్టాండ్ ఏరియా, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పరిసరాల్లో, వ్యవసాయ, ఎఇ కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచారం చేపట్టారు. ప్రజాసంఘాల నాయకులు బి.వీరశేఖర్, ఎం.నరసరావు, అశోక్, యూసుఫ్, పరమేష్, బజారి, కెపి.రాముడు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం : ఎమ్మెల్యే

మంత్రాలయం : మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని చెట్నేహళ్లి గ్రామానికి చెందిన నర్సన్న (41) అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబానికి వైఎస్‌ఆర్ బీమా పథకం కింద రూ.లక్ష మంజూరయింది. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు తక్షణ సహాయం కింద రూ.10 వేల నగదును సర్పంచి అంజిని, ఉప సర్పంచి వీరనాగప్ప, ఎంపిటిసి రామాంజనేయులు, నాయకులు గంగుల వెంకటేష్, నాగేంద్ర చేతులమీదుగా మృతుని భార్య నాగలక్ష్మికి అందజేశారు. మిగిలిన రూ.90 వేలు మృతుని భార్య ఖాతాలో జమ చేస్తామని సర్పంచి అంజిని తెలిపారు.

కక్షపూరితంగానే వేధింపులు

- మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జి మీనాక్షినాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై గట్టిగా పోరాడుతున్నారనే కక్షతోనే టిడిపి నాయకులు, అయ్యన్న పాత్రుడు కుటుంబాన్ని వైసిపి ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు విమర్శించారు. శుక్రవారం ఆదోనిలోని టిడిపి కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండానే అర్ధరాత్రి సమయంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన కుమారుడు రాజేష్ ఇంట్లో సిఐడి పోలీసులు ప్రవేశించి అరెస్టు చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో పోలీసులు అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేయడం మాని, రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ పెద్దలు ఏం చెబితే అది చేస్తూ కొందరు పోలీసులు చట్టాన్ని గాలికి వదిలేశారని మండిపడ్డారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని తెలిపారు. రాష్ట్రంలో మాత్రం ఇది అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడితే వారిపై కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని విమర్శించారు. సిఐడి అధికారులను హైకోర్టు అనేక మార్లు చీవాట్లు పెట్టినా వారిలో ఏ మాత్రం మార్పు రాకపోవడం విచారకరమన్నారు. టిడిపి జిల్లా కార్యదర్శి బుద్ధారెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసె శ్రీరాములు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, టిఎన్‌టియుసి నాయకులు మల్లి, టిఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు రామాంజనేయులు, నాయకులు వెంకటేష్ వాల్మీకి, సిద్ధప్ప, కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ బాలాజీ, బసవ, మహ్మద్, రైతు విభాగం నాయకులు అయ్యన్న, శేషిరెడ్డి, నాగరాజు, వీరేష్, ఆరెకల్లు రామకృష్ణ, మైనార్టీ నాయకులు ఇంతియాజ్, హనువాలు మాబాష, మహిళా నాయకులు సాధికా బేగం, నందమూరి అభిమానులు సూరి, షణ్ముఖ, మహానంది పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు


సమస్యలపై అలసత్వం వద్దు

- జగనన్న గృహాలను వేగవంతం చేయాలి

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - గోనెగండ్ల

గ్రామ సచివాలయాల్లో వివిధ సమస్యలు, సంక్షేమ పథకాల కోసం ప్రజలు చేసుకునే దరఖాస్తులపై సచివాలయ సిబ్బంది అలసత్వం వహించకూడదని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బైలుప్పలలో గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామ సచివాలయాల్లో ప్రజలు చేసుకునే దరఖాస్తులపై ఆరా తీశారు. బియ్యం కార్డుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంతో 'ఎందుకు, ఎవరి లాగిన్‌లో పెండింగ్‌లో ఉంటున్నాయి' అని అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయంలో ప్రజలు చేసుకునే దరఖాస్తులపై అలసత్వం చేయకుండా ఎవరి లాగిన్‌లో వారు వీలైనంత త్వరగా పరిష్కరించి ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. అనంతరం గోనెగండ్లలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి జగనన్న గృహాల పురోగతిపై సమీక్షించారు. ఈసారి గోనెగండ్ల పర్యటనకు వచ్చేలోపు జగనన్న కాలనీలో గృహాల నిర్మాణాలను వేగవంతం చేసి పురోగతి చూపాలని ఆదేశించారు. తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపిడిఒ ప్రవీణ్ కుమార్, హౌసింగ్ ఎఇ లక్ష్మన్న పాల్గొన్నారు.




గోనెగండ్లలో సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్

భ్రూణహత్యల నివారణకు చర్యలు

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

సమాజంలో లింగ అసమానతలకు కారణమవుతున్న భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారించేందుకు కృషి చేయాలని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ పిసిపిఎన్‌డిటి చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆదోని సబ్ కలెక్టర్ ఛాంబర్‌లో 'భ్రూణ హత్యలు నివారించడం-పిసి పిఎన్‌డిటి చట్టం'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల ఆలోచన విధానంలో మార్పులు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించగలమని తెలిపారు. రానున్న రోజుల్లో గర్భస్థ శిశువులపై లింగ వివక్షకు వ్యతిరేకంగా, పిసి పిఎన్‌డిటి చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై సమాచారం అందించిన వారికి నగదు బహుమతి అందిస్తామన్నారు. నిబంధనలు ఉల్లంగించిన వారిపై రూ.50 వేలు జరిమానా నుంచి 3 ఏళ్ల వరకు జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. ఆదోని డివిజన్ పరిధిలో ఉన్న 31 స్కానింగ్ కేంద్రాలను ప్రతి 3 నెలలకోసారి తనిఖీ చేసి నూతన రిజిస్ట్రేషన్లు, రెన్యువల్, సిబ్బంది, చిరునామా, పరికరాల్లో మార్పులు వంటి అంశాలపై తనిఖీ చేస్తామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కానింగ్ సెంటర్ల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సత్యవతి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెట్ డాక్టర్ లింగన్న, గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత, డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.



ఆదోనిలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

సిపిఎం కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

- మంత్రికి సిపిఎం వినతి

ప్రజాశక్తి-ఆలూరు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పట్టణంలోని సిద్ధేశ్వర నగర్, సిపిఎం కాలనీలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సిపిఎం నాయకులు కెపి.నారాయణ స్వామి, షాకీర్ కోరారు. శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దాదాపు 15 సంవత్సరాల నుంచి రోజు కూలి నిరుపేదలు సిద్ధేశ్వర నగర్, సిపిఎం కాలనీలో కొట్టాలు వేసుకుని నివాసం ఉంటున్నారని తెలిపారు. విద్యుత్ సరఫరా కోసం కట్టెల సహాయంతో లైన్లను వేసుకున్నారని చెప్పారు. అవి ప్రమాదకరంగా ఉన్నందున విద్యుత్ స్తంభాల గురించి గతంలో విద్యుత్ అధికారులను, గ్రామ పంచాయతీ అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

హాలహర్వి ప్రభుత్వాస్పత్రిలో వైద్యం కరువు

- 11 గంటలు దాటినా రాని వైద్య సిబ్బంది

- సెలైన్ ఎక్కించిన స్వీపర్

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి ప్రభుత్వాస్పత్రిలో వైద్యం కరువైంది. 11 గంటలు దాటినా సిబ్బంది ఆస్పత్రికి రాలేదు. అక్కడ విధులు నిర్వహిస్తున్న స్వీపర్ రోగికి సెలైన్ ఎక్కించిన సంఘటన చోటు చేసుకుంది. మండలంలోని బాపురం గ్రామానికి చెందిన యువకుడు చాకలి పరశురాముడు తన పొలంలో మందు పిచికారి చేస్తూ అస్వస్థకు గురయ్యారు. బాపురం నుంచి హాలహర్వికి వస్తున్న మాజీ సర్పంచి నాగేంద్ర 108కు ఫోన్ చేశారు. రావడానికి సమయం పడుతుందని గ్రహించి యువకుని తన కారులో ఎక్కించుకొని హాలహర్వి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రోగిని తీసుకెళ్లడానికి ఎవరూ రాలేదు. ఆయన వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులో మాత్రం ఆరుగురు హాజరయినట్లు ఉన్నా ఒక్కరే విధుల్లో ఉన్నట్లు తెలిసింది. ఉన్న నర్సు సెలైన్ ఎక్కించడానికి ఇబ్బందులు పడుతుండడం చూసి స్వీపర్ వచ్చి సెలైన్ ఎక్కించినట్లు సమాచారం. అనంతరం వైద్యులు వచ్చి యువకునికి ప్రథమ చికిత్సను అందించారు. యువకుని పరిస్థితి మెరుగుపడింది. సమయానికి ప్రభుత్వాస్పత్రికి వస్తే వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానని వారు తెలిపారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్ర నాథ్ రెడ్డి

ఎండుతున్న వరి పైర్లు

- అప్పులు ఎలా తీర్చాలని అయోమయంలో రైతులు
- వందల ఎకరాల్లో వరి పంటకు తెగుళ్లు
- మరొపక్క తెగుళ్లు -ఆందోళనలో రైతన్నలు

ప్రజాశక్తి - కొత్తపల్లి



ర్రగ మారిన వరి పైరు



మాడిపోయిన వరి పైరు

దేశానికి అన్నం పెట్టే రైతన్నలు ఆరుగాలం కష్టపడి ఎండనకా వాననకా కష్టపడు తుంటారు. ప్రతిరోజు పొలాల్లో ఉంటూ విత్తనాలు వేసిన నాటి నుంచి పంటలు కోసేదాకా పంట పొలాల్లోనే ఉంటూ శ్రమ పడుతుంటారు. పంటలు పెట్టుబడి కోసం అప్పులు చేసి పంటలు వచ్చాక ఆ అప్పులను తీర్చుకోవాలన్న సంకల్పంతో పంట పొలాల్లో జీవనం సాగిస్తూంటారు. తమ పంటలు బాగున్నాయని మురిసిపోతూ ఉన్న తరుణంలో పైరులకు విపరీతమైన తెగుళ్ల సోకితే రైతన్నల వేదనలు అంతా ఇంతా కాదు. అలాంటి బాధనే కొత్తపల్లి మండలం వరి రైతులు పడుతున్నారు.

కొత్తపల్లి మండలంలో ఉన్న పలు గ్రామాల్లో ఉన్న రైతులు ఖరీఫ్ సీజన్లో భాగంగా వరి పంటలను దాదాపు 1.750 హెక్టార్లలో సాగు చేశారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరి పంటలకు అగ్గి తెగులు రావడంతో పాటు వరి పంటలు ఉన్నఫలంగా సుడులు ఎండి పోవడం జరుగుతుంది. అలాగే తెగుళ్ల వచ్చిన వరి పంటలు పూర్తిస్థాయిలో ఎండి పోతున్నాయి. అలాగే ప్రస్తుతం పరిస్థితుల్లో కూడా వరి పంటకు తెల్ల వెన్ను తెగులు సోకి రైతన్నలు వేసిన వరి పంటలు పూర్తి స్థాయిలో దెబ్బతింటున్నాయి. దీంతో రైతన్నలు పంటలను వేసినప్పటినుంచి కోసుకునేదాకా కంటికి రెప్పలా కాపాడుకున్న పంటలు చేతికి వచ్చిన సమయంలో వర్షాల కారణంగా తెగుళ్ల సోకి దెబ్బతిన్న పంటలను చూసిన రైతన్నలు దిక్కు తోచని స్థితిలో పడిపోయిన పరిస్థితి నెలకొంది. కేవలం గువ్వలకుంట్ల గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వరి పైరులని తెగుళ్లతో ఉన్నాయి. రైతన్నలు పంటల పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు ఎలా కట్టాలో అని ఆందోళన చెందుతున్న పరిస్థితి నెలకొందని వరి రైతులు చర్చించుకుంటున్నారు. పంటల కోసం లక్షలు అప్పులు చేసి పంటలు వేసాము కానీ క్షేత్రస్థాయిలో చూస్తే పంటలు పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. కర్నూలు సోనా మైసూర్ వరి పంటకు తెల్ల వెన్ను తెగులు రావడంతో పూర్తిగా పంటలు దెబ్బతింటున్నాయి. కంకి దశలో ఉన్న వరి పంటలు ఒక్కసారిగా తెగుళ్ల బారిన పడ్డాయి. తెగుళ్ల వల్ల నష్టపోయిన రైతులందరికీ నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రైతులు కోరారు.

వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి

- మహేష్, వ్యవసాయ అధికారి.

గ్రామాల్లో ఉన్న వరి రైతులు మండల వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి. తెగుళ్ల వచ్చిన వెంటనే రైతులు అధికారుల సలహాల మేరకు తగిన మందులు వరి పంటలకు పిచికారి చేయాలి. వరి పంటలకు తగినంత నీరు ఉండే విధంగా చూసుకోవాలి. అధిక నీరు వల్ల పంటలకు తెగ్గులు సోకే ప్రమాదం ఉంది.

నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలి

- సంజీవ రాయుడు, రైతు సంఘం నాయకులు.

మండలంలో వరి పంటలు వేసి తెగుళ్లతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. రైతులు లక్షలు పెట్టుబడి పెట్టి పంటలు వేశారని కనీసం పెట్టుబడులు కూడా రావు. మండల వ్యవసాయ అధికారులు గ్రామాల్లో తిరిగి నష్టపోయిన ప్రతి రైతులను గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపాలి. అలాగే దెబ్బతిన్న వరి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేదాకా రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. అధికారులు స్పందించి నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

చేసిన అప్పులు కూడా తీరవు

- రవికుమార్, రైతు గువ్వలకుంట్ల.



పంటల కోసం చేసిన అప్పులు కూడా రావని పంటలు మొత్తం పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ ఏడాది 3.50 ఎకరాలకు వరి పంట వేసి దాదాపు 45 వేల రూపాయలు ఖర్చు వచ్చిందన్నారు. మా పొలంలో చూస్తే తెగుళ్లతో ఉన్న పంట అంతా ఎండిపోయి ఎర్రబడింది. దీంతో అప్పు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. తెగుళ్ళకు ఎన్ని మందులు కొట్టిన కంట్రోల్ కావడం లేదు. చేతికి వచ్చిన సమయంలో ఇలా జరగడంతో అర్థం కావడం లేదు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులందరిని ఆదుకోవాలి.

ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పనులపై ప్రత్యేక దృష్టిసారించి పూర్తి చేయండి

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో శాసనసభ్యులు ప్రతిపాదించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు రాష్ట్ర స్థాయిలో ఫాలోఅప్ చేసి సాధ్యం కాని పనులు మా దృష్టికి తీసుకురావాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వైఎస్ఆర్ సెంటినరీ హాలులో నియోజకవర్గాల అభివృద్ధిపై స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే బ్రిజేంద్రనాథ్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణ బాబు, జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్, జిల్లా ఎస్పి రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఇంఛార్జి డిఆర్ఒ మల్లికార్జునుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యేలు ప్రజా అవసరాల దృష్ట్యా అధికారుల దృష్టికి తీసుకొచ్చిన అంశాలను ప్రతిపాదనల రూపంలో ప్రభుత్వానికి పంపిస్తూ రాష్ట్ర స్థాయిలో ఫాలోఅప్ చేసి సాధ్యం కాని పనులు మా దృష్టికి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక సమస్యలపై ప్రజలు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొస్తారని.... ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పనులను అశ్రద్ధ చేయకుండా ప్రత్యేక దృష్టి సారించి సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండల కేంద్రంలో పిహెచ్‌సిని సిహెచ్‌సిగా అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణ బాబును కోరారు. నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి మాట్లాడుతూ నందికొట్కూరు సమీపంలో రూ.10 కోట్లతో రిజర్వాయర్ నిర్మించారే కానీ సంబంధిత ఆయకట్టు భూములకు నీరందించేందుకు భూసేకరణ పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్య తీసుకోవాలని ఆత్మకూరు ఆర్డీవోకు సూచించారు.

వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణ బాబు మాట్లాడుతూ అందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు 13 సచివాలయాల పరిధిలో ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు వైద్యుల సిబ్బంది కొరత లేకుండా అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన పనులను ప్రతిపాదనలు తయారుచేసి తనకు పంపాలని డిఎంహెచ్‌ఒను ఆయన ఆదేశించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలాని సామూన్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన పనులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తి చేసేందుకు పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఇసాక్ భాషతో పాటు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి కాటసాని రామిరెడ్డి శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి బ్రిజేంద్ర నాథ్ రెడ్డి తదితరులు తమ నియోజకవర్గాల లోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అశ్రునయనాల మధ్య చల్లా అంతిమయాత్ర

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- కడసారి అభిమాన నేతను చూసేందుకు తరలివచ్చిన అశేష జనం

ప్రజాశక్తి - అవుకు



అధికారిక లాంచనాలతో చల్లా భౌతికకాయానికి అంతిమ సంస్కారం నిర్వహిస్తున్న అధికారులు

హైదరాబాదులోని ఏఐజి ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతి చెందిన ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు చల్లా భగీరథ్ రెడ్డి అంత్యక్రియలను శుక్రవారం అధికారం లాంఛనాలతో, అశ్రునయనాల మధ్య కుటుంబ సభ్యుల సమక్షంలో చల్లా ఫామ్ హౌస్ లో కీర్తి శేషులు ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి సమాధి పక్కనే నిర్వహించారు. ఎమ్మెల్సీ ఇంటి వద్ద ఆయన పార్థివ దేహానికి సంప్రదాయ పద్ధతిలో కార్యక్రమాలు నిర్వహించి వైకుంఠ రథంపై పార్థివదేహాన్ని ఉంచి అంతిమయాత్రను కొనసాగించారు. ఎమ్మెల్సీ సతీమణి చల్లా శ్రీలక్ష్మీ, కుమారులు చల్లా రాజ్యాభిషేక్ రెడ్డి, చల్లా రామకృష్ణారెడ్డిలు అంతిమయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఎమ్మెల్సీ చిన్నాన్నలు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, అవుకు ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా విజయ భాస్కర్ రెడ్డి, చల్లా అమర్నాథ్ రెడ్డి, చల్లా ప్రభాకర్ రెడ్డి, చల్లా విగ్నేశ్వర రెడ్డి, చల్లా రఘునాథరెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోచిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జయ చంద్రారెడ్డి, మోట్ల రామిరెడ్డి, చల్లా శ్రీలక్ష్మి తల్లిదండ్రులు రాఘవేంద్రారెడ్డి సుహాసిని,చల్లా కుటుంబంలోని మహిళలు అంతిమయాత్రలో పాల్గొని చివరిసారిగా చల్లా భగీరథ్ రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించారు.

అంతిమయాత్రలో అభిమాన నాయకుడిని కడసారి చూసేందుకు నియోజకవర్గంలోని అభిమానులు, కార్యకర్తలు, స్నేహితులు, అవుకు పట్టణ ప్రజలు దారి పొడవునా బారులు తీరి పూల వర్షం కురిపిస్తూ తమ నాయకుడికి అంతిమ వీడ్కోలు పలికారు. ఎమ్మెల్సీ సతీమణి, కుమారులను చూసి ప్రజలు కన్నీటి పర్యంతమయ్యారు. బనగానపల్లి శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి, కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ చైర్మన్ మలికిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి లు అంతిమయాత్రలో పాల్గొన్నారు. అనంతరము పార్థివ దేహాన్ని చల్లా ఫామ్ హౌస్ లో డోన్ ఆర్డిఓ వెంకటరెడ్డి, ఆత్మకూరు ఆర్డీవో, తహసిల్దార్ శ్రీనివాసులు, డోన్ డి.ఎస్.పి శ్రీనివాస్ రెడ్డి, బనగానపల్లి సిఐ సుబ్బరాయుడు పోలీసులతో గౌరవ వందనాన్ని స్వీకరించి గాలిలోనికి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. డోన్ ఆర్డీవో జాతీయ పతాకాన్ని ఎమ్మెల్సీ సతీమణి, కుమారులకు అందజేశారు. అనంతరం కుటుంబ సభ్యులు పార్థివ దేహాన్ని సమాధిలో ఉంచి అంత్యక్రియలను శాస్త్రోక్తంగా కన్నీటి పర్యంతమవుతూ నిర్వహించారు. ఈ అంతిమయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా డోన్ డి.ఎస్.పి ఆధ్వర్యంలో ఎస్సై జగదీశ్వర రెడ్డి, రామాంజనేయ రెడ్డి, రమేష్ రెడ్డి, రామిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



చల్లా భగీరథ రెడ్డి అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన అభిమానులు, ప్రజలు



చల్లా భగీరథ రెడ్డి భౌతికకాయం దగ్గర కుటుంబ సభ్యులు



అంతిమయాత్రలో అభివాదం చేస్తున్న భగీరథ రెడ్డి సతీమణి

అంగన్ వాడి వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆత్మకూరు



మహాసభలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి యేసు రత్నం

అంగన్వాడి వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏసురత్నం డిమాండ్ చేశారు. అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆత్మకూరు ప్రాజెక్టు మహాసభ శుక్రవారం పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో మంజుల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కు బడ్జెట్‌ను పెంచాలన్నారు. అంగన్వాడి వర్కర్స్‌కు పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని తెలిపారు. అంగన్వాడీలకు శిక్షణ ఇవ్వకుండా రోజుకు ఒక యాప్ పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. అనంతరం ప్రాజెక్ట్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ప్రాజెక్ట్ అధ్యక్షులుగా మంజుల, కార్యదర్శి హరిత, ట్రెజరర్ లక్ష్మిదేవి, ఉపాధ్యక్షులు శ్రీదేవి, వెంకటలక్ష్మి, భాగ్యలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా చంద్రకళ, తులసమ్మ, కుమారి, మరో 16 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్ నాయక్, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ సేవలు ప్రశంసనీయం

- ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇషాక్ బాష,
- పారిశుధ్య సిబ్బందికి హైజిన్ కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్



హైజిన్ కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెలే, ఎమ్మెల్సీ, తదితరులు

నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ సంస్థ సేవలు ప్రసంశణీయం అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాష అన్నారు. నంద్యాల మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి అధ్యక్షతన రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల ఆధ్వర్యంలో 400 మంది మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య సిబ్బందికి నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి చేతుల మీదుగా హైజిన్ కిట్లును శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్మన్ షేక్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల మునిసిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య సిబ్బందికి విలువైన హైజిన్ కిట్లను రెడ్ క్రాస్ సంస్థ అందజేయడం అభినందనీయం అన్నారు. రాష్ట్రంలోనే నంద్యాల జిల్లా రెడ్ క్రాస్‌కు మంచి పేరు వచ్చేలా తన వంతుగా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మున్సిపల్ చైర్మన్ మబున్నిసా మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా క్వారంటైన్ సెంటర్లలో పలుచోట్ల రెడ్ క్రాస్ సంస్థ అత్యుత్తమ సేవలు అందించారని అన్నారు. జిల్లాకు ఒక నూతన కమిటీని కలెక్టర్ ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. ఈ కమిటీకి అన్ని రకాలుగా తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, మున్సిపల్ చైర్ పర్సన్ మబన్నీసాలను రెడ్ క్రాస్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కోశాధికారి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు నాగేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు ఉస్మాన్ బాష, యాకోబు, మద్దిలేటి, నాగ సురేంద్ర, నాగరాజు, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, రెడ్ క్రాస్ సభ్యులు నాగరాజు, శ్రీనివాసులు, నయీం, డిపిఓ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతుల నష్టపరిహారం కొరకు నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

- జయప్రదం చేయాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - మిడుతూరు

నకిలీ విత్తనాలతో, అతివృష్టి, అనావృష్టిలతో నష్టపోయిన పత్తి రైతులకు నష్టపరిహారం కొరకు శనివారం నిర్వహించే నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు, విద్య పోగు సుజ్ఞానం కోరారు. శుక్రవారం రైతు సంఘం వినతి మేరకు మిడుతూరు మండల కేంద్రంలోని పత్తి రైతుల పొలాలను వ్యవసాయ అధికారి నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ నూజివీడు గోల్డ్, మైకో, సిద్ధ, జాదు, సఫల, అమర్ బయోటెక్ కార్గిల్ సీడ్స్, కబడి, అకిరా, శ్రీ భాగ్య, తదితర కంపెనీలు వేయడం వలన రైతులు పూతకాయ రాలిపోయి కనీసం ఎకరాకు ఒక క్వింటాలు కూడా దిగుబడి రావడం లేదన్నారు. నకిలీలకు అడ్డగా కల్తీ విత్తనాలు అమ్ముతూ రైతులను మోసం చేస్తున్న విత్తన కంపెనీల పైన చట్టపరమైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేలు ఎంపీలు రైతులకు ఇంత నష్టం జరుగుతున్న కనీసం రైతుల పొలాలను పరిశీలించకపోవడం బాధాకరమన్నారు. శనివారం నాడు కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నామని జిల్లా నలుమూలల నుండి పత్తి రైతులు పాల్గొని ధర్నాలు జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆంజనేయులు, కార్మిక సంఘం మండల కార్యదర్శి ఓబులేష్, లింగస్వామి, రైతులు జయ రాముడు, ఏసన్న, సురేష్, మహానంది, లాజర్ తదితరులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

తాత్కాలిక సూపర్వైజర్ పోస్టుల భర్తీకి కసరత్తు

- ఆగమేఘాలపై భర్తీకి చర్యలు
- రద్దు చేయాలని అంగన్వాడి టీచర్ల డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో సీనియర్ అంగన్వాడి వర్కర్లను తాత్కాలిక సూపర్ వైజర్లుగా నియమించుకు నేందుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఆగమేగాలపై సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేసేందుకు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గత మూడు రోజుల కిందట ప్రభుత్వం తాత్కాలిక పద్ధతిన సూపర్వైజర్ పోస్టులను భర్తీ చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిన విషయం విధితమే. రెండు అంగన్వాడి సెంటర్లు దగ్గరలో ఉండి మేడ్జ్ అయిన అంగన్వాడి సెంటర్లలోని హై క్వాలిఫికేషన్ కలిగిన టీచరను తాత్కాలిక సూపర్వైజర్ గా వీధిలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఈ క్రమంలోనే జిల్లాలో ఖాళీగా ఉన్న 30 గ్రేడ్ 2 సూపర్వైజర్ పోస్టుల భర్తీకి ఐసిడిఎస్ సిడిపిఓలు కసరత్తు ప్రారంభించారు. ఆయా ప్రాజెక్టులలో సీనియర్లుగా ఉన్న అంగన్వాడీ టీచర్లు వివరాలను సేకరిస్తున్నారు. అది కూడా రెండు నెలల కిందట గ్రేడు 2 పోస్టులకు రాత పరీక్ష రాసిన వారి లిస్టులోని సీనియర్ అంగన్వాడీల వివరాలను ప్రస్తుతం పని చేస్తున్న సూపర్వైజర్ల నుండి సేకరిస్తున్నారు.

తాత్కాలిక పద్ధతిన నియమించుకొని ఈ సూపర్వైజర్లకు 5 వేల గౌరవ వేతనం ఇచ్చే పని చేయించు కోవాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. శాశ్వత ప్రతిపాదికన గ్రేడ్ 2 సూపర్వైజర్లను నియమించుకోవడానికి నోటిఫికేషన్ ఇచ్చి రాత పరీక్షలు రాయించి ఇంటర్వ్యూ లు కూడా నిర్వహించారు. అవకతవకలు జరిగాయని ఫలితాలు ప్రకటించకుండా మెరిట్ లిస్టు వేయకుండానే కొంతమందిని సెలెక్ట్ చేసి ఎలా ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని కొంతమంది అభ్యర్థులు కోర్టుకు వెళ్లిన విషయం తెలిసిందే. కోర్టులో కేసు నడుస్తుండగానే ప్రభుత్వం తాత్కాలిక సూపర్వైజర్లను నిర్వహించుకుని వారిద్వారా విధులు నిర్వహించాలని చేస్తున్న ప్రక్రియను అంగన్వాడి టీచర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

కోర్టులో ఉండగా ఎలా సూపర్వైజర్లను నియమిస్తారని అంగన్వాడి టీచర్లు బాహాటంగా విమర్శిస్తున్నారు. తాత్కాలిక పద్ధతిన సూపర్వైజర్ పోస్టుల భర్తీని ఆపాలని ఆ ప్రక్రియనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ సరైంది కాదని, శాశ్వత ప్రతిపాదికననే పోస్టుల భర్తీకి చీరలు తీసుకోవాలని అంగన్వాడీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ప్రక్రియ తాత్కాలికమే అని చెబుతున్నప్పటికీ భవిష్యత్తులో అంగన్వాడీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వాపోతున్నారు. అంగన్వాడి కార్యకర్తలను ఇంచార్జి సూపర్వైజర్లుగా నియమించుకొని పనిచేపించుకుంటున్నారని అయితే వారికి ఇస్తామన్న వేతనం కూడా ఇవ్వకుండా పెట్టి ప్యాకెట్ చేయించుకుం టున్నారని ఆరోపిస్తున్నారు. కోర్టులో ఉండగా ఇలాంటి ప్రక్రియ చేపట్టడం సరైనది కాదనే వాదన అంగన్వాడిలో వినిపిస్తుంది.

రెగ్యులర్ సూపర్‌వైజర్ నియామకాలు చేపట్టాలి

- తాత్కాలిక పద్ధతి రద్దు చేయాలి
- అంగన్వాడీ వర్కర్స్ యూనియన్

రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సూపర్వైజర్ పోస్టుల విషయంలో లింకు సూపర్ వైజర్స్ తాత్కాలికంగా సర్వీసు చదువుకున్న వారిని నియమించాలనే నిబంధనలను వ్యతిరేకిస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ సూపర్వైజర్ల ప్రక్రియ తక్షణమే చేపట్టాలి. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సూపర్వైజర్ల రాత పరీక్షలో అక్రమాలు జరిగాయని అనేక మంది వర్కర్లు కోర్టుకు వెళ్లడం జరిగిందని, అయితే కోర్టు తీర్పు రాక ముందే తాత్కాలిక లింకు సూపర్వైజర్స్ గా నియమిస్తున్నామని ప్రకటన చేయడం తగదు. ఈ విషయంపై కోర్టు తీర్పు వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి తప్ప ఇలా అంగన్వాడీలు శ్రమ కారుచౌకగా దోచుకోవడం సరైన పద్ధతి కాదు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో కూడా ఇన్చార్జ్ సూపర్వైజర్ నియమించి కనీసం వారికి ఇస్తానన్న వేతనం కూడ ఇవ్వకుండా వేతనం లేని వెట్టిచాకిరి చేయించుకొని వారిని మోసం చేశారు. ఇప్పుడు మరలా అంగన్వాడీలను మరో సారి మోసం చేయటానికి పూనుకుంది. తాత్కాలిక సూపర్వైజర్ల నియామకాన్ని రద్దు చేయాలని గత నెల 31న సిడిపిఓలకు, జిల్లా కలెక్టర్లకు మెమొరండాలు కూడా ఇవ్వడం జరిగింది. తక్షణమే రెగ్యులర్ సూపర్వైజర్ల ప్రక్రియ నిర్వహించలని అవినీతి అక్రమాలకు తావు లేకుండా సూపర్వైజర్ల ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నాము.

చల్లా కుటుంబంతో విడదీయరాని బంధం

ఎమ్మెల్యే కాటసాని కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : చల్లా కుటుంబంతో కాటసాని కుటుంబానికి వీడదీయరాని బంధం ఉందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అవుకు పట్టణంలో ఎమ్మెల్సీ చల్లా భగీరథరెడ్డి అంత్యక్రియలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ నాడు చల్లా రామకృష్ణా రెడ్డి, నేడు చల్లా భగీరథ రెడ్డి లేరని విషయాన్ని ఇప్పటికీ నమ్మలేకపోతున్నానని తెలిపారు. చల్లా కుటుంబానికి కాటసాని కుటుంబానికి ఎన్నో సంవత్సరాల నుండి అనుబంధం ఉందని, ఎప్పుడు ప్రేమానురాగాలు అలాగే వుంటాయని తెలిపారు. చల్లా కుటుంబానికి కాటసాని కుటుంబాల మధ్య ఎన్నో సంవత్సరాల నుంచి మంచి సంబంధాలు వున్నాయని తెలిపారు. కుమారుడు చల్లా భగీరథ రెడ్డిని కోల్పోవడం బాధాకరమైన సంఘటన అని ఆ దేవుడు వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ఇవ్వాలని ఆ కుటుంబానికి ముఖ్య మంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ,కాటసాని కుటుంబం ఎప్పుడు అండగా ఉంటామని తెలిపారు.

కనీస వేతనం కోసం పోరాటాలకు సిద్ధం కావాలి : సిఐటియు

నందికొట్కూరు : కనీస వేతనం సాధించుకునేందుకు పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, అంగన్వాడి జిల్లా కార్యదర్శి శేఖరాణి, సిఐటియు జిల్లా కమిటీ కార్యదర్శి కె భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నందికొట్కూరులో కిసాన్ పార్క్ నందు అంగన్వాడి మహాసభ ప్రసన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లకు పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతన చట్టం వెంటనే సవరించాలని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కులను రక్షించాలని కోరుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కార్మిక వ్యతిరేకంగా తీసుకువచ్చిన 44 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కార్మిక కోడులను తీసుకువచ్చిందని తక్షణమే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమవేతనం 26000 ఇవ్వాలన్నారు. అంగన్వాడి నూతన కమిటీని 27 మందితో ఎన్నుకోవడం జరిగింది. కార్మిక వర్గానికి అండించిన కార్మిక వర్గ వేగుచుక్క సిఐటియు అని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ చంద్రకళ, రత్నకుమారి, ప్రభావతి, విమల, రమణ బాయ్, సుశీలమ్మ, రాములమ్మ, రమణమ్మ, నాగమణి, వరలక్ష్మి పాల్గొన్నారు. **అంగన్వాడినూతన కమిటీ ఎన్నిక :** అధ్యక్షురాలుగా మదర్ బి, ఉపాధ్యక్షురాలుగా శైలజ, బి. ఖుషద్ బి, కార్యదర్శి. శివలక్ష్మి, సహాయ కార్యదర్శి కోమల, కోశాధికారి.శైలజలను నూతన కమిటీని ఎన్నుకున్నారు.


మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

ప్రశ్నించే వారిని గెలిపించండి

కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజులను గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజా సమస్యలపై ప్రశ్నించే పిడిఎఫ్ ఎమ్మెల్సీలు బలపరుస్తున్న పశ్చిమ రాయలసీమ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పోతుల నాగరాజు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిలను గెలిపించాలని బిసి, ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షులు పెరుగు శివకృష్ణ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థిగా డాక్టర్ పోతుల నాగరాజు, కత్తి నరసింహారెడ్డి గెలిపించాలని పెరుగు శివ కృష్ణ యాదవ్, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యం మండలి జిల్లా కార్యదర్శి శివయ్య, బీసీ సంఘం జిల్లా నాయకులు పాండురంగా యాదవ్, ఏఐఎస్ఎఫ్ బనగానపల్లె నియోజకవర్గ కార్యదర్శి పవన్ కళ్యాణ్, ఎస్టియు ఉపాధ్యాయ సంఘం జిల్లా నాయకులు శ్రీనుల ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో, కార్యాలయాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసనమండలిలో ప్రజా సమస్యలపై, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీలు బలపరుస్తున్న డాక్టర్ పోతుల నాగరాజును, కత్తి నర్సింహారెడ్డిలను గెలిపించాలని కోరారు.


ప్రచార నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నష్టపోయిన పత్తి రైతును ఆదుకోవాలి : సిపిఎం

బండి ఆత్మకూర్ : పత్తి దిగుబడి రాక నష్టపోయిన రైతును ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి డేవిడ్లు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు బండి ఆత్మకూరులో దిగుబడి రాక పత్తి పంటను రైతు దున్నేసిన పొలంను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో నిత్యం రైతులు నష్ట పోతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. నకిలీ విత్తనాలతో మండలంలోని అనేక గ్రామాల్లో పత్తి రైతులు తీవ్ర నష్టం వాటిల్లిందని అన్నారు. కాయలు, పూత రాక చెట్టు ఏపు పెరగుతున్నడంతో పంటను పరిస్థితిని గమనించిన రైతు నాగ శేషారెడ్డి తన పత్తి చేను ట్రాక్టర్ తో తొక్కించి దున్నివేశాడన్నారు. నష్టపోయిన రైతుకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

అకాల వర్షంతో నష్టపోయిన రైతులను ఆదు కోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఈర్న పాడు, మణికంఠపురం, వెంగళరెడ్డి పేట గ్రామాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షానికి వరి పంట నేల కూలిన పంటలను సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన రైతులను గుర్తించి వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, సుబ్బరాయుడు, డేవిడ్, రాజు, రైతులు పాల్గొన్నారు.


దున్నిన పత్తి పంటను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం రిపోర్టును బహిర్గతం చేయండి : రైతుసంఘం

పాణ్యం : నంద్యాల జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం ఇచ్చన రిపోర్టును వెంటనే బహిర్గతం చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు, పాణ్యం మండల నాయకులు కె భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవడం కోసం ఆలస్యం చేయకుండా శాస్త్రవేత్తల బందం పర్యటన సందర్భంగా పరిశీలించిన అంశాలను పరిగణనలోకి తీసుకుని వెంటనే రిపోర్ట్ ను బహిర్గతం చేసి నష్టపోయినటువంటి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. నకిలీ విత్తనాల వల్ల పంట నష్టపోయిన ప్రతి రైతుకు పత్తి పంటకు ఎకరాకు 70 వేల రూపాయలు నష్టపరిహారంగా ఇవ్వాలన్నారు. పంట బీమా సౌకర్యం కల్పించాలని, నకిలీ విత్తనాలు విక్రయించిన అన్ని కంపెనీలపై చర్యలు తీసుకోవాలన్నారు.

15వ వార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని బి.ఆర్.ఆర్ నగర్ 15వ వార్డులో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కమిషనర్ పి.కిషోర్, వార్డు కౌన్సిలర్ కృష్ణవేణమ్మ శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు వార్డులో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. రోడ్లు లేని చోట సిసి రోడ్లు, డ్రైనేజీ ల నిర్మాణాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇంచార్జ్ లు బ్రహ్మయ్య, జగదీశ్వరయ్య, మద్దిలేటి ఆచారి, పి.రమేష్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఈబీసీ నేస్తంను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-ఆళ్లగడ్డ

వైయస్సార్ ఈబీసీ నేస్తం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆళ్లగడ్డ మండల తహశీల్దార్ హరినాథ్ రావు తెలిపారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అగ్ర కులాల వారికి ఈబీసీ నేస్తం పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారులకు 15వేల రూపాయలు మంజూరు చేస్తుందన్నారు. ఈనెల 10వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు ఆళ్లగడ్డ మండల పరిధిలో సుమారుగా ఈబీసీ నేస్తం పథకానికి సంబంధించి 1600 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీల ఓటు నమోదుకు ఈనెల 7 లోపు దరఖాస్తులు చేసుకోవాలనానరు. ఈ కార్యక్రమంలో మండల రిటర్నింగ్ అధికారి తబ్బిబ్బు, రవీంద్ర ప్రసాద్, తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయం : వ్యకాస

ప్రజాశక్తి - కోయిలకుంట్ల

వ్యవసాయ కార్మిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా వ్యవసాయ కార్మిక సంఘం పనిచేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రోటరీ క్లబ్ భవనం నందు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల రెండో మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎం సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగు భూమి లేని పేదలకు రెండు ఎకరాలు భూమి ఇవ్వాలని, అలాగే ఐదు సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని పక్కా గృహం నిర్మాణానికి ఐదు లక్షలు కేటాయించాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రస్తుతం జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి రాబోకాలంలో ఈ సంఘం పోరాటాల నిర్వహిస్తుందన్నారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులు గా దస్తగిరి, కార్యదర్శిగా రాములమ్మ, కోశాధికారిగా బాలస్వామి మరియు కమిటీ సభ్యులుగా రమేష్, త్యాగరాజు, మధు, సుబ్బయ్య, అచ్చమ్మ, రంగమ్మ, వ్యవసాయకార్మికులు పాల్గొన్నారు.

పంట నమోదును సరిచూసుకోవాలి : ఎడిఎ

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఈ-పంట నమోదు చేసుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాలలో వివరాలను చూసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.ఆంజనేయ, మండల వ్యవసాయ అధికారి డి.విష్ణు వర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు మండలంలోని నల్లకాల్వ గ్రామంలో గ్రామ సభలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పంట నమోదులో ఏవైనా అభ్యంతరాలు,తప్పులు ఉంటే సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించి సరి చేసుకోవాలని తెలిపారు. అనుమానాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకొని రావాలని వారు రైతులను కోరారు. గ్రామ సభలలో రైతుల జాబితాను చదివి వినిపించాలని, అలాగే స్థానిక రైతు భరోసా కేంద్రాలలో కూడా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు.

సంస్మరణ సభలను జయప్రదం చేయండి : ఐఎఫ్టియు

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఈ నెల 6వ తేదీన బోల్లవరం జరుగు అమర వీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని ఐఎఫ్టియు నాయకులు మజీద్ మియ్యా కోరారు. ఈ మేరకు శుక్రవారం గోడ పత్రికలను స్థానిక ఐఎఫ్టియు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఐఎఫ్టియు నాయకులు మజీద్ మియ్యా మాట్లాడుతూ నవంబర్ 1నుంచి 9 వరకు దేశ వ్యాప్తంగా అమరులైనటువంటి అమరవీరులను స్మరిస్తూ వారి వర్ధంతి సభలు జయప్రదం చేయాలని కోరారు. బిజెపి దాని మాతృ సంస్థ అయిన ఆర్ఎస్ఎస్, సంగ్ పరివార్ శక్తులు దేశంలో చేయని అరాచకాలు లేవు అన్నారు. పిడిఎస్యు నందికొట్కూరు డివిజన్ కార్యదర్శిని ఎన్నుకునానరు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆది, నాయకురాలు చూరిబీ,దేవమ్మ పాల్గొన్నారు.

రుద్రవరంలో పారిశుధ్య పనులు : సర్పంచి

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం మేజర్ పంచాయతీ లోనిపరమటి వీధి, ఎస్సీ కాలనీలో శుక్రవారం పారిశుధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ బైరి,విజయలక్ష్మి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్సీపీ నాయకుడు బైరి బ్రహ్మం ఆధ్వర్యంలో పరమటి వీధి ,ఎస్సీ కాలనీలో రోడ్లపై పేరుకుపోయిన మట్టిని పారిశుధ్య కార్మికుల చేత తొలగించి శుభ్రం చేయడం జరిగిందన్నారు.ప్రజలు కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా సర్పంచ్ కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

ప్రజాశక్తి - బేతంచెర్ల

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బాధితులకు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం అందజేశారు. మండల పరిధిలోని ముసలాయి చెరువు గ్రామ నివాసి మిడుతూరు జయరాం రెడ్డి కాలేయం కిడ్నీల వ్యాధితో బాధపడుతూ సీఎం రిలీఫ్ ఫండ్కు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే మిడుతూరు జయరాం రెడ్డి ఈ మధ్యకాలంలో మరణించడం జరిగింది. సీఎం రిలీఫ్ ఫండ్ కింద దరఖాస్తు చేసుకున్నందుకు మంజూరు అయిన రూ.12 లక్షల చెక్కును మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మిడుతూరు జయరాం రెడ్డి భార్య లక్ష్మీదేవికి అందజేశారు. **పాములపాడు :** మండలం జూటూరు గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డికి రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాల మేరకు నందికొట్కూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తువ్వ శివరామకృష్ణారెడ్డి, పాములపాడు మండల వైసీపీ నాయకులు టి నాగరాజు చేతుల మీదుగా మూడు లక్షల చెక్కును శుక్రవారం అందజేశారు. రామకృష్ణారెడ్డి సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి, బైరెడ్డిసిద్ధార్థరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బుగ్గన

ప్రజాశక్తి - బేతంచర్ల: బేతంచెర్ల పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, బుగ్గన బలరామిరెడ్డిల మాతృమూర్తి అయిన బుగ్గన పార్వతమ్మ గత నెల 29వ తేదీన గుండెపోటుతో మరణించడం జరిగింది. శుక్రవారం బేతంచెర్ల ధరణి టౌన్షిప్లోని చంద్రారెడ్డి, బలరామిరెడ్డిల నివాసానికి వెళ్లి బాధితులను ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బేతంచర్ల మండలం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ సిహెచ్ చలం రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రుద్రవరం నారాయణ, కాంట్రాక్టర్ రామచంద్రుడు, లక్ష్మి రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని హరినగరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బాలికలకు మరుగుదొడ్ల నిర్మాణం కోసం వైసిపి నాయకుడు సవరం నాగముని శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల రెండో విడత,నాడు నేడు పథకం కింద రూ 20 లక్షల నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఇందులో భాగంగా బాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మించేందుకు భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు శోభారాణి, సిఆర్పి రహింతుల్లా, ఉపాధ్యాయులు రమేష్, శ్రీనివాసులు, పాఠశాల కమిటీ చైర్మన్ అంజలి, వైస్ చైర్మన్ సత్యానందం పలువురు గ్రామస్తులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న నాగ ముని

వాల్మీకిలను ఎస్టిలుగా గుర్తించాలి : విఆర్పిఎస్

ప్రజాశక్తి - ఆత్మకూర్

ప్రభుత్వం ఏక సభ్య కమిషన్ ద్వారా రిపోర్ట్ త్వరగా తెప్పించుకొని వాల్మీకులను ఎస్టిలుగా గుర్తించాలని వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కోరారు. వాల్మీకుల్లో చైతన్యం నింపేందుకు శుక్రవారం ఆత్మకూరు,కొత్తపల్లి మండలాల్లో అనేక గ్రామాల్లో వాల్మీకి నేతలు పర్యటించారు. ఆత్మకూరులో విలేకరుల సమావేశంలో వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బోయ పులికొండన్న, రాష్ట్ర కార్యదర్శి పరమటూరి శేఖర్, నంద్యాల జిల్లా విఆర్పిఎస్ ప్రధాన కార్యదర్శి మధు గోపాల్, విఆర్పిఎస్ నంద్యాల జిల్లా యూత్ అధ్యక్షులు స్వామినాయుడు, ఆత్మకూరు మండల నాయకులు రాముడు,రమణ మాట్లాడారు. బోయలకు అన్యాయం చెయ్యాలని చూస్తే ఉపేక్షించేది లేదని నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు వాల్మీకిలకు గతంలో ఎరంర ఎస్టి హోదా ఎందుకు తొలగించారో అనే సహేతుకమైన కారణం చూపలేకపోతున్నారని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆలస్యంగా స్పందించినా ఇచ్చిన మూడు నెలల లోపల ఏకసభ్య కమీషన్ రిపోర్ట్ తెప్పించుకుని కేంద్రంతో మాట్లాడి పార్లమెంట్లో ఆమోదం పొందేలా కృషి చెయ్యాలని కోరారు.

మినుము పంటను దున్నేసిన రైతు

చాగలమర్రి : అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల మినుము పంట దెబ్బ తినడంతో పంట దిగుబడి వచ్చే పరిస్థితి లేక పోవడంతో రైతు పంటను దున్నేశాడు. మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన రైతు నారాయణరెడ్డి 8 ఎకరాల మినుము పంటను సాగు చేశారు. అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల పంట పూర్తిగా దెబ్బతిన్నది. పెట్టిన పెట్టుబడి వచ్చే పరిస్థితి లేక పోవడంతో శుక్రవారం పంటను దున్నేశాడు. రూ .2.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టి నష్టపోయామని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సంక్లిప్త సమాచారం

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించాలి : ఎంపిపి

బండి ఆత్మకూర్ : ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు డి చిన్న సంజీవరెడ్డి కోరారు. శుక్రవారం ఐటిడిఏ ఆసుపత్రి నందు జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదలు వైద్య ఖర్చులను భరించలేని వారు ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తుంటారని వారికి మెరుగైన వైద్యం అందించి సేవ చేయాలని వైద్యా ఆరోగ్య సిబ్బందిని కోరారు. ఆస్పత్రి డెవలప్మెంట్ కోసం ప్రభుత్వం ప్రతి ఏటా నిధులు మంజూరు చేస్తుందని దానికి ఎంపీపీ అధ్యక్షతన కమిటీ ఉంటుందన్నారు. ఎంపీపీ దే రెడ్డి చిన్న సంజీవరెడ్డి కమిటీ అధ్యక్షులుగా డాక్టర్ కిరణ్ కుమార్ కన్వీనర్గా సభ్యులుగా ఎంపీడీవో, తాసిల్దార్ నారాయణపురం సర్పంచ్ ఎండూరి సరిత, వెంగళ్రెడ్డిపేట సర్పంచ్ పల్లె నాగమణి సభ్యులుగా ఉంటారన్నారు.కమిటీలో తీసుకున్న నిర్ణయం ప్రకారం నిధులను ఖర్చు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వాసుదేవగుప్త, వైద్యఆరోగ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి - ఉయ్యాలవాడ

మండలంలోని కొండపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ను ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు శుక్రవారం సందర్శించి, నాడు-నేడు పనులను, మధ్యాహ్నం భోజనమును పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సహ పంక్తి భోజనము చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొండుపల్లే గ్రామ సచివాలయమును ఎంపిపి శ్రీమతి భాగ్యమ్మ, గ్రామ సర్పంచు శ్రీమతి ఇరిగెల పద్మజ సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది హాజరును పరిశీలించారు. అంగడివాడి స్కూల్ను సందర్శించి మధ్యాహ్నం భోజనమును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగడివాడి టీచర్కు, ఆయాకు పలు సూచనలు చేశారు.

నాడు-నేడు పనులలో నాణ్యత లోపిస్తే చర్యలు : ఎంపీడీవో

ప్రజాశక్తి - పగిడ్యాల



మనబడి, నాడు-నేడు పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈఓ సుభాన్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ప్రాతకోట గ్రామంలోని ప్రత్యేక పాఠశాల, ఎం గణపురం, ఎన్ గణపురం గ్రామాలలోని ఎంపీపీ పాఠశాలలను నాడు నేడులను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నాడు నేడు పనుల్లో నాణ్యతలో రాజీ పడవద్దు అని నాణ్యతతో నిర్మాణం పనులు చేపట్టా లని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఈ ఓ ఆర్ డి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల కేంద్రంలో తరచూ చోటు చేసుకుంటున్నా రోడ్డు ప్రమాదాలను నివారించడంలో భాగంగా శుక్రవారం నాడు బేతంచెర్ల పట్టణంలో వివిధ కూడలిలా యందు ఎస్సై శ్రీనివాసులు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. అధిక ప్యాసింజర్లను ఎక్కించుకొని వస్తున్న ఎక్కించుకొని ప్రయాణిస్తున్న 5 ఆటోలను తనిఖీ చేసి, కేసు నమోదు చేసి నట్లు ఎస్సై తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపే ప్రతి వాహనాన్ని పై తప్పకుండా కేసు నమోదు చేస్తామని ఆయన అన్నారు.

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్స్పల్ సెక్రటరి కృష్ణబాబు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ


పేద ప్రజలందరికీ మెరుగైన వైద్యము అందించడమే ప్రభుత్వ ధ్యేయం అని, అందుకోసమే ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజిషియన్ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కృష్ణబాబు అన్నారు. శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ప్రభుత్వ వైద్యశాలను శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డితో కలిసి పరిశీలించారు. ముందుగా ఆయన ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి భవనాన్ని, వైద్య సౌకర్యాలను అలాగే నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్లు, గ్రామ సచివాలయాలలోని వైయస్సార్ హెల్త్ క్లినిక్ల ద్వారా మొబైల్ మెడికల్ క్లినిక్లు ఏర్పాటు చేసి వైద్యం అందించాలన్నది ప్రభుత్వ ధ్యేయమన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఎప్పటికప్పుడు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం జరుగుతుందన్నారు. 16 వేల కోట్లతో నాడు- నేడు కింద 17 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నామని అలాగే ఆసుపత్రుల రూపురేఖలు మార్చి అన్ని వైద్య సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి ఎనిమిది కోట్ల నిధులు మంజూరయ్యాయని దీంతో ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు ఉండే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ వెల్ఫేర్ కమిషనర్ నివాస్, ఏపీఎస్ఎంహెచ్ఐడిసి చైర్మన్ మురళీధర్ రెడ్డి, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ జఫుల్లా, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ రామిరెడ్డి, డిఎం హెచ్ ఓ వెంకటరమణ, డిప్యూటీ డి ఎం హెచ్ వో తిరుపాలయ్య, ప్రభుత్వ వైద్యులు రాజ్యలక్ష్మి, శివకుమార్, రెడ్డి నాయక్, కళ్యాణ్, కమిషనర్ రమేష్ బాబు,మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ నరసింహారెడ్డి, కౌన్సిలర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, డి ఈ నాగేశ్వరరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **శిరివెళ్ల:** మండల పరిధిలోని గోవిందపల్లె గ్రామ వైయస్సార్ హెల్త్ క్లినిక్ను ప్రిన్సిపల్ సెక్రెటరీ సందర్శించి ఫ్యామిలీ ఫిజీషియన్ విధానము అమలు గురించి అధికారులకు, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. **చాగలమర్రి :** రాష్ట్ర ప్రభుత్వం పిహెచ్సిల ద్వారా మెరుగైన వైద్య సేవలను అందిస్తోందని రాష్ట్ర కుటుంబ సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రెటరీ కృష్ణబాబు పేర్కొన్నారు. శుక్రవారం నాడు ఆయన చాగలమర్రి పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా నాడు - నేడు క్రింద జరిగిన అభివృద్ధి పనులను కూడా ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్, డిప్యూటీ డైరెక్టర్ రాఘవేంద్ర, డైరెక్టర్ రామిరెడ్డి, డిఎంహెచ్ఓ వెంకటరమణ,జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి, మండల వైద్యాధికారి నారాయణరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గంగుల బ్రిజేంద్రరెడ్డితో కలిసి వివరాలు తెలుసుకుంటున్న కృష్ణ బాబు

వైద్య ఆరోగ్యశాఖలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

- ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఎన్జీవో బృందం వినతి

నంద్యాల కలెక్టరేట్ : వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు విసిహెచ్ వెంగళరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి రెడ్డి, నంద్యాల తాలూకా అధ్యక్ష కార్యదర్శులు మణి శేఖర్ రెడ్డి, హుస్సేన్ రెడ్డిలు వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కృష్ణబాబును కోరారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ నంద్యాలకు వచ్చిన సందర్భంగా ఎన్జీవో ప్రతినిధి బృందం ఆయనను కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం నాయకులు మాట్లాడుతూ ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో ఔట్సోర్సింగ్ కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని వారి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఆప్కాస్లోని సమస్యలు సరిచేయుటకు జిల్లా అధికారులకి అధికారం ఇవ్వాలని కోరారు. నంద్యాల ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు డిఈఓ, అసిస్టెంట్ ఎంపీఎస్ఎస్ ఇతర సిబ్బందికి ఆప్షన్ ఇచ్చి ఏపివివిపి హాస్పిటల్స్కు బదిలీ చేయాలని కోరారు. తదితర సమస్యలను కృష్ణబాబుకు విన్నవించారు.




గర్భిణీ మహిళలకు బహుమతులు అందజేస్తున్న బ్రహ్మానంద ఆచారి

లింగ వివక్ష నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి : జెకెఆర్

ప్రజాశక్తి - బనగానపల్లె

లింగ విభచ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని నందవరం గ్రామంలో జే కే ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జే ఎస్ ఎస్ బ్రహ్మానంద చారి ఆధ్వర్యంలో గుంటూరుకి చెందిన కవయిత్రి బి నాగేశ్వరి సహకారంతో 'లింగవివక్ష నిర్మూలన బాలిక విద్యను ప్రోత్సహిద్దాం ,ఆరోగ్య జాగ్రత్తలు'పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య సూత్రాలు పాటించిన గర్భవతులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద ఆచారి మాట్లాడుతూ లింగ వివక్ష నిర్మూలనకు సమాజంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ కేర్ ఆఫీసర్ టీ గ్రేసీ మాట్లాడుతూ ప్రజలు నాటు వైద్యులను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, ఎటువంటి ఆరోగ్య సమస్య ఉన్న మా ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలని కోరారు. గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్ సావిత్రమ్మ, నందవరం ఏఎన్ఎంఏ రాజకుమారి, బియాల లక్ష్మి ,ఆశా వర్కర్లు వెంకటలక్ష్మి, రమాదేవి, అన్నపూర్ణ,అరుణ,గర్భిణీ స్త్రీలు పాల్గొన్నారు.


క్యాష్ షోలో పాల్గొన్న అనంత విద్యార్థులు

ఈటీవీ క్యాష్ షోలో
ఆళ్లగడ్డ అనంత విద్యార్థులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ పట్టణానికి చెందిన అనంత జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు శుక్రవారం హైదరాబాద్ రామోజీ ఫిలిం సిటీలో జరిగిన క్యాష్ షోలో పాల్గొన్నారు. మల్లెమాల ఎంటర్టైన్మెంట్ వారి ఆధ్వర్యంలో సుమ కనకాల యాంకరింగ్ లో నిర్వహిస్తున్న క్యాష్ షో ప్రోగ్రామ్ కు ఆళ్లగడ్డ అనంత జూనియర్, డిగ్రీ కళాశాల విద్యార్థులు కళాశాల కరస్పాండెంట్ అనంత రామ సుబ్బారెడ్డి, ప్రెసిడెంట్ అనంత విజయలక్ష్మిలతో కలిసి షోలో పాల్గొన్నారు. ఈ క్యాష్ షో ప్రోగ్రాంలో హీరోయిన్ శ్రీలీల, మ్యూజిక్ డైరెక్టర్ సమీర్, సినీ నటుడు సమీర్, డైరెక్టర్ త్రినాధరావు నక్కిన, అనంత కళాశాల కామర్స్ అధ్యాపకులు వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంత విద్యాసంస్థల అధినేత అనంత రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మల్లెమాల ఎంటర్టైన్మెంట్ వారు నిర్వహిస్తున్న క్యాష్ షో ప్రోగ్రాంలో తమ కళాశాల విద్యార్థులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.